

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదివారం తెలిపారు. సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 8977716661కు సమస్యలు తెలియజేయాలని కోరారు. లేదంటే 9133331912కు మెసేజ్ పెట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

రూ.2వేల కోట్లతో పరిశ్రమలు

● రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం



ప్రారంభానికి సిద్ధమైన కోర్టు యార్డు మారియట్ హోటల్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రూ.2వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. నాయుడుపేట సెజ్ పరిధిలో రూ.200 కోట్ల పెట్టుబడులతో 3ఎక్స్ ఫర్ ఇన్నోవేచర్ లిమిటెడ్ ఫార్మసుటికల్స్ ప్రారంభం కానుంది. ఇందులో 300మందికి పైగా ప్రత్యక్షంగా, మరో వందమందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. అక్కడే రూ.300 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ తయారు చేసే దమ్ము బయో ఫ్యూయల్స్ కంపెనీకి శంకుస్థాపన చేయనున్నారు. దీనిద్వారా 500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. తిరుపతి రూరల్ తిరుచానూరు వద్ద రూ.200కోట్లతో నిర్మితమైన కోర్టు యార్డు మారియట్ స్టార్ హోటల్ ప్రారంభం కానుంది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300మందికి ఉపాధి లభించనుంది. వీటితోపాటు సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు, సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం శిరసనంబేడు, గూడూరు నియోజకవర్గం కొమ్మనెట్టూరులో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. తిరుచానూరు వద్ద మారియట్ హోటల్‌ను, నాయుడుపేట సెజ్‌లో దమ్ము బయో ఫ్యూయల్స్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించనున్నారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ గడువు పెంపు

తిరుపతి(ఆటోనగర్),నవంబరు9 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల్లో గృహ విద్యుత్ వినియోగదారులు అదనంగా ఉన్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ కోరారు. ఇంకా చాలామంది వినియోగదారులు చేసుకోని కారణంగా డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. విద్యుత్ సర్వీసు తీసుకునే సమయంలో దరఖాస్తులో పొందుపరచిన లోడ్‌కంటే అదనంగా వాడిన వారు తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.కిలోవాట్‌కు 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రాయలచెరువు బాధితులకు రూ.3.24కోట్ల సాయం



కలెక్టర్ చొరవతో రికార్డు సమయంలో మంజూరైన నిధులు

జిల్లాలోని కేవీబీపురం మండలంలో ఓళూరు రాయలచెరువు కట్ట తెగిన ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రూ.3.24 కోట్ల మేరకు ప్రభుత్వ సాయం మంజూరైంది. కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ చొరవ తీసుకోవడంతో రికార్డు సమయంలో నిధులు విడుదలయ్యాయి. ప్రభుత్వ పరంగా ఇంత వేగంగా విపత్తు బాధితులకు ఆర్థిక సాయం అందిన దాఖలాలు ఇప్పటి దాకా ఎక్కడా లేదు. దీనికి సంబంధించిన పూర్వాపరాలిలా వున్నాయి.

సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలం ఓళూరు పంచాయతీ పరిధిలోని రాయలచెరువు కట్ట ఈనెల 6వ తేదీన తెల్లవారుజామున తెగిపోయిన సంగతి తెలిసిందే. ముందస్తు హెచ్చరికలు, పోలీసు యంత్రాంగం వేగంగా స్పందించడంతో పెనుముప్పు తప్పింది. అయితే సమయం చాలా తక్కువగా ఉండటంతో ప్రాణాలు కాపాడుకునే ఆత్రుతలో ముఖ్యంగా కళత్తూరు దళితవాడ వాసులు భారీగా నష్టపోయారు. గ్రామంలోకి ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తున చెరువు నీరు ప్రవహించడంతో ఇళ్లలోని ధాన్యం సహా సామాన్లు అన్నీ కొట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో పశువులు చనిపోయాయి. కళత్తూరు దళితవాడ తీవ్రంగా దెబ్బతినగా పాతపాలెం, ఎస్ఎల్ పురం గ్రామాలలో కూడా కొంత మేర నష్టం సంభవించింది. ఈ మూడు గ్రామాల్లో కలిపి 980 ఇళ్లలోకి చెరువు నీరు చేరింది. దుర్ఘటన జరిగిన సమయానికి కలెక్టర్ విజయవాడలో ఉన్నారు. అక్కడి నుంచే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి హుటాహుటిన బాధిత గ్రామాలకు అధికారులను, ఉద్యోగులను పంపించారు. సహాయక చర్యలకు ఆదేశాలివ్వడడంతో పాటు సాయంత్రానికి కేవీబీపురం చేరుకుని స్వయంగా బాధిత గ్రామాలలో పర్యటించారు. కళత్తూరు దళితవాడ వాసులకు జరిగిన తీవ్ర నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ వేగంగా స్పందించారు.

ఓ వైపు సహాయక చర్యలను కొనసాగిస్తూనే మరోవైపు అంతే వేగంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నష్టపోయిన 960 కుటుంబాలలో ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు చొప్పున తక్షణ ఆర్థిక సాయం కోసం రూ.28.80 లక్షలు, 1,100 పశువులు నీళ్లలో కొట్టుకుపోయిన నేపథ్యంలో ఆయా రైతులకు ఆర్థిక సాయంగా రూ.2.95 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. అదనంగా బాధిత కుటుంబాలలో ఒక్కో దానికి 25 కిలోలు బియ్యం, కిలో కంది పప్పు, లీటరు పామాయిల్, కిలో ఎర్రగడ్డలు, కిలో బంగాళాదుంపలు, కిలో చక్కెర తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాల్సిన అవసరముందని అభ్యర్థించారు. ప్రభుత్వ మౌఖిక అనుమతితో నిత్యావసర వస్తువులు ఇప్పటికే పంపిణీ చేసేశారు. ఇలాంటి విపత్తులు సంభవించినపుడు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం, నష్టపోయిన కుటుంబాలకు రూ.500 ఆర్థిక సాయం అందించడం సాధారణంగా జరిగేదే. కలెక్టర్ ప్రత్యేక చొరవ కారణంగా కుటుంబానికి రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం అంగీకరించింది. కాగా విపత్తుల సందర్భంగా పాడిపశువులు మృతి చెందితే ప్రభుత్వం పరిహారం ఇచ్చినా పశువుకు రూ.50 వేలు ప్రకటించడం అరుదు. పరిహారం మంజూరుకు కూడా చాలా సమయం తీసుకుంటుంది. అయితే రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో పశువులను కోల్పోయిన బాధితులకు పశువుకు రూ. 50 వేలు చొప్పున సాయం అందేలా కలెక్టర్ ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఆ సాయం కూడా మూడు రోజుల్లోనే ప్రభుత్వం నుంచి విడుదల చేయించడం మరింత అరుదనే చెప్పాలి. నిత్యావసర వస్తువుల పంపిణీకి అదనంగా రూ.3.24 కోట్ల ఆర్థిక సాయాన్ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల బాధితుల్లోనే కాకుండా జిల్లా ప్రజల్లో సైతం ప్రభుత్వం పట్ల, జిల్లా యంత్రాంగం పట్ల నమ్మకాన్ని పెంచినట్టయింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




అటవీ శాఖ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకిస్తూ...

కుంకీల విన్యాసాలను సెల్ఫీల్లో బంధిస్తూ...



ముసలిమడుగులో రెండు గంటలు

● ఆద్యంతం చలాకీగా పవన్

పలమనేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలమనేరు పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆయన్ను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు ఎగబడ్డారు. వారి తాకిడిని తట్టుకోలేక పోలీసులు ఆ ప్రాంతమంతా ఆంక్షలు విధించారు. షెడ్యూల్ కంటే గంట ఆలస్యంగా పలమనేరు సమీపంలోని పెంగరగుంట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్న పవన్‌కు స్వాగతం పలికేందుకు కేవలం 8మందినే లోపలికి అనుమతించారు. జనసేన నాయకులు చాలామందికి అనుమతి లభించకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్,కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్, డీఎఫ్‌వో సుబ్బరాజు తదితరులు పవన్‌కు స్వాగతం పలికారు. హెలిపాడ్ చుట్టూ తన కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు పవన్ అభివాదం చేశారు. ఎమ్మెల్యే గురజాల సూచన మేరకు తమిళనాడు నుంచి వచ్చిన అభిమానుల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు. హెలిపాడ్ బయట పలువురు ఆయనకు సమస్యల మీద అర్జీలు ఇచ్చారు. అక్కడి నుంచి కారులో నేరుగా ఎలిఫెంట్ క్యాంపు వద్దకు వెళ్లిన పవన్ అటవీశాఖ అధికారుల పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ఏనుగులతో మనుషులకు జరుగుతున్న అన్నిరకాల నష్టాల్ని తగ్గించే చర్యలు' అనే అంశంపై నిర్వహించిన ఈ ప్రజంటేషన్ చూశాక అధికారులకు పలు సూచనలు చేశారు. హనుమాన్ ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు.కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించారు.దాదాపు రెండుగంటల పాటు ముసలిమడుగులో వున్న పవన్ ఆద్యంతం చలాకీగా గడిపారు.


అభిమానులతో సెల్ఫీ

నిరాశలో జనసేన శ్రేణులు

తమ పార్టీ అధినేత డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి జిల్లాకు రావడంతో జనసేన శ్రేణులు మురిసిపోయారు. తాము కలిసే అవకాశం ఉంటుందని, మాట్లాడి ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుందని భావించినా వారికి నిరాశే మిగిలింది. సాధారణంగా సీఎం చంద్రబాబు జిల్లాల్లో పర్యటించినప్పుడు టీడీపీ ముఖ్య శ్రేణుల కోసం సమయాన్ని కేటాయిస్తారు. అలాగే లోకేశ్ పర్యటనల్లో శ్రేణుల కోసం సమయం కేటాయించి ఫొటోలు తీసుకుంటారు. ఆదివారం పవన్ కూడా అలా శ్రేణుల్ని, కనీసం నాయకుల్ని పలకరిస్తారని ఆశించారు. జనసేన నాయకులతోనే కాకుండా టీడీపీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కూడా సమయాభావం వల్ల రిజర్వ్‌డ్‌గానే వ్యవహరించారు.

కుంకీల కోసం కృషి చేశా:అమర్



అడవి ఏనుగుల ద్వారా మనుషుల ప్రాణాలకు, పంటలకు తీవ్ర నష్టం కలుగుతోందని, కుంకీ ఏనుగులతోనే దీన్ని నివారించవచ్చని గుర్తించాను.అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మీకు ఈ విషయంగా అర్జీ ఇచ్చాను. అసెంబ్లీలో ఇదే విషయమై రెండుసార్లు మాట్లాడానంటూ పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చెప్పారు.తానీ విషయంలో చేసిన కృషికి సంబంధించిన రికార్డులను పవన్‌కు అందించారు.అటవీ శాఖ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సమయంలో ఏనుగుల మంద కంటే ఒంటరి ఏనుగులతోనే ఎక్కువ ప్రమాదమంటూ వివరించబోయిన అమర్‌ను తాను మాట్లాడతానంటూ పవన్ వారించడం ఎమ్మెల్యేని నొచ్చుకునేలా చేసింది.

మంగళంపేట అటవీ భూముల సర్వే



కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలోని అటవీ భూములను ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏరియల్ సర్వే నిర్వహించినట్లు అటవీశాఖ రేంజర్ థామస్ సుకుమార్ తెలిపారు. మంగళంపేట సమీపంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన వ్యవసాయ భూములకు సమీపంలో అటవీ భూమి ఆక్రమణకు గురైందని ఈ ఏడాది జనవరిలో కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో తదితర అధికారులు పరిశీలించారు. అనంతరం ఆక్రమణకు గురైన అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం పలమనేరు పర్యటనకు వెళుతూ ఏరియల్ సర్వే చేపడతారని అటవీశాఖ అధికారులు ఉదయంతోనే అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. డిప్యూటీ సీఎంకు కనిపించేలా ఆ ప్రాంతంలో ఎరుపు రంగు జెండాను నాటి మంటలు రాజేసి పొగపెట్టారు.పవన్ కల్యాణ్ పలమనేరు పర్యటనలు ముగించుకొని తిరిగి వెళుతూ మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేసినట్లు రేంజర్ తెలిపారు.

తోపులాటలో మహిళకు గాయాలు



ఎలిఫెంట్ క్యాంపును సందర్శించి తిరిగి హెలిప్యాడ్‌కు డిప్యూటి సీఎం వెళ్తుండగా మార్గమధ్యంలోని ఇందిరానగర్ వద్ద పవన్ అభిమానులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. హేమ అనే మహిళ అభిమానంతో హారతి ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు, అక్కడున్న అభిమానులు పక్కకు తోయడంతో ఆమె కాలికి గాయాలయ్యాయి.'ఆమెను పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి అన్ని పరీక్షలు నిర్వహించగా, ఎడమకాలికి చిన్న గాయమైందని..ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంగా వివిధ టీవీ ఛానెళ్లలో వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన యువకుడి అరెస్టు

వెంకటగిరి, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో వెంకటగిరి పట్టణం బొగ్గులమిట్టకు చెందిన కొండూరు చంద్రశేఖర్‌రాజును కృష్ణ జిల్లా పెనగలూరు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అతని ఇంటి వద్ద అరెస్టు చేశారు. ఇటీవల మాలపాటి భాస్కర్‌రెడ్డి అరెస్టు తర్వాత పోలీసులు సోషల్ మీడియాలో పాత పోస్టులపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. భాస్కర్‌డ్డిని విచారించే సమయంలో చంద్రశేఖర్‌రాజు పేరు వెలుగులోకి వచ్చింది. ఆయన ఖాతా నుంచి వెలువడిన పాత పోస్టులను బయటకు తీశారు. అందులో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించి ఉండటంతో అరెస్టు చేశారు.


జగన్‌తో చంద్రశేఖర రాజు

పరకామణి కేసులో నేడూ విచారణ

● అధికారుల ముందుకు ఇద్దరు పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి కేసులో అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు రవికుమార్, అతని భార్య రమ్య, కుమార్తె ప్రసూషలు విచారణలో వెల్లడించిన వివరాలతో విచారణ వేగవంతానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో తిరుమలలో పనిచేసి వీఆర్‌లో ఉన్న జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్ బృందం సోమవారం విచారించనుంది. ఇప్పటికే టూ టౌన్ సీఐగా పనిచేసి వీఆర్‌కు బదిలీ అయిన చంద్రశేఖర్‌ను విచారించారు. లోక్ అదాలత్‌లో రాజీ ప్రొసీడింగ్స్, రవికుమార్ ఆస్తిపత్రాలు, టీటీడీ ఎస్టేట్ అధికారుల నుంచి సేకరించిన డాక్యుమెంట్లు ఆధారంగా దర్యాప్తుపై దృష్టి సారించారు. చెన్నైలో రవికుమార్‌కు సంబంధించిన స్థిర, చరాస్తులపై ఆరా తీయనున్నట్లు తెలిసింది. ఇందుకోసం మరో వారం రోజుల్లో సీఐడీ అధికారులు చెన్నైకు వెళ్లి స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఐజీని కలవనున్నారు. వివరాలు సేకరించనున్నారు. ఈ మొత్తం వివరాలతో కూడిన నివేదిక, ఆధారాలు హైకోర్టు ఎదుట సమర్పించనున్నారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.1.61కోట్లు విడుదల

● ఉమ్మడి జిల్లాలో 26 పాఠశాలల్లో ఊపందుకోనున్న పనులు

తిరుపతి(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగదల, పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.61కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 26 పాఠశాలల్లో ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఎలక్ట్రిఫికేషన్, ప్రధాన మరమ్మతుల కోసం ఈ నిధులు వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నిధుల వినియోగం, అమలు, పనుల పర్యవేక్షణ బాధ్యతలను పాఠశాలల నిర్వహణ కమిటీలకు అప్పగించింది.

తిరుపతి జిల్లాకు రూ.60.90లక్షలు : తిరుపతి జిల్లాలో 9 పాఠశాలల్లో నాలుగింటిలో ప్రహరీ గోడలు, మూడింటిలో మరుగుదొడ్లు, రెండింటిలో ప్రధాన మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకుగాను రూ.60.90 లక్షలు కేటాయించారు. **చిత్తూరు జిల్లాకు రూ.1.01 కోట్లు :** చిత్తూరు జిల్లాలో 17 పాఠశాలలకుగాను ఏడింటిలో ప్రహరీ గోడలు, మూడింటిలో బాలుర మరుగుదొడ్లు, ఆరింటిలో బాలికల మరుగుదొడ్లు, ఒక్క పాఠశాలలో ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టనున్నారు. రూ.1.01 కోట్లను విడుదల చేసింది.

డిసెంబరులో రెండు ప్రయోగాలకు షార్ సన్నద్ధం

సూళ్లూరుపేట,నవంబరు9(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) డిసెంబరులో సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి రెండు ప్రయోగాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుంది. డిసెంబరు తొలివారంలో శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికన్ కమ్యూనికేషన్ బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగం చేపట్టనుంది. చివరివారంలో పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం మొదటి ప్రయోగ వేదిక నుంచి చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతున్నారు. ఈ రాకెట్‌కు వినియోగించే పరికరాలు ఆదివారం కేరళలోని తిరువనంతపురం వీఎస్ఎస్‌సీ సెంటర్ నుంచి ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ షార్‌కు చేరాయి. రెండో వాహక అనుసంధాన భవనం (వ్యాబ్)లో ఎల్వీఎం3-ఎం6 రాకెట్ అను సంధాన పనులు జరుగుతున్నాయి. మొదటి ప్రయోగ వేదిక వద్ద పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగ పనులు కూడా జరుగుతున్నాయి. రెండు ప్రయోగాలనంతరం వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రైవేట్ వారి భాగస్వామ్యంతో పీఎస్ఎల్వీ-ఎల్1 రాకెట్ ప్రయోగించనున్నారు. రాకెట్ల తయారీ ఒప్పందం కింద ప్రైవేట్ రంగం వారు తయారీ చేసిన తొలి పీఎస్ఎల్వీ రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నానికి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేస్తున్న అధికారులు, పండితులు

తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో నెల 17 నుంచి జరగనున్న కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం ఆలయ అధికారులు ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను ఆహ్వానించారు. ఆహ్వాన పత్రిక అందజేసి వేదపండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో వారాంతపు సెలవులను పురస్కరించుకుని ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. నాయుడుపేటకు చెందిన నటరాజు కళాక్షేత్రం నృత్యకారిణి శ్రీలక్ష్మి నేతృత్వంలో చిన్నారులు నవదుర్గలు, గరుడ గమన, శివపాద మంజీర నాదం, అష్టలక్ష్మి స్తుతి, ముద్దుగారే యశోద వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారిని ఏవో సుధాకర్ దుశ్శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 9-ఫెర్టిలిటీ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ స్వప్న శ్రీనాథ్

తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఆదివారం 9-ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో రెండవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐవీఎఫ్, ఐయూఐ ద్వారా సంతానం పొందిన 28మంది తల్లులు తమ పిల్లలో కలిసి హాజరయ్యారు. వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఫెర్టిలిటీ క్లినికల్ హెడ్ డాక్టర్ స్వప్న శ్రీనాథ్ మాట్లాడుతూ తమ వద్ద చికిత్సలు చేయించుకున్న వారిని తల్లిదండ్రులుగా చూడటం ఆనందంగా ఉందన్నారు. రీజనల్ సీఈవో డాక్టర్ హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోగుల సంతృప్తి, ఫలితాల నాణ్యతే తమ లక్ష్యమన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని, ఫెర్టిలిటీ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



దామలచెరువు జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

పాకాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకునారు. 40 యేళ్ల తరువాత కలుసుకున్న వీరంతా పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంబరపడ్డారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఉత్సాహంగా గడిపారు. ఆనాటి గురువులు జి.అన్నయ్యనాయుడు, కె.సీతాపతినాయుడు, విశ్వనాథ రెడ్డి, టీవీఎస్, నందకుమార్, సులోచనాదేవి, సయ్యద్‌బాషాపీర్, రామకృష్ణ మనాయుడు, మనోహర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘ సమన్వయ కర్త పత్తిపాటి దేవరాజుల నాయుడు, ఎంఈవో బాబ్జీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతులకు పూలంగి సేవ



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపాన అగస్త్యేశ్వరాలయంలో రుద్రపాదాల ము క్కోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతులకు ఘ నంగా పూలంగి సేవను నిర్వహించారు. ఉదయం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లిదేవికి అభిషేకం నిర్వహించాక దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులను నంది వాహనంపై అధిష్ఠింపజేసి భక్తులకు దర్శనమిచ్చారు. 10 గంటలకు ఉత్సవర్లను విశేషంగా అలంకరిం సుగంధభరిత పుష్పాలతో పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. రాత్రి స్వామిఅమ్మవార్లు రావణాసుర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

చంద్రగిరి/పాకాల/తిరుపతిఅర్బన్/రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను చంద్రగిరి మండలంలో వైసీపీ నాయకులు, నిర్వహించారు.టవర్ క్లాక్ సమీపంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. వైసీపీ నాయకులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, మల్లం చంద్రమౌళిరెడ్డి, అగరాల దేవరాజులరెడ్డి, తుకాకుల భాస్కర్‌రెడ్డి, యారాశి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాకాల మండలంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి,మండల వైసీపీ అధ్యక్షుడు నంగా నరేష్ రెడ్డి, పాల్గొన్నారు. మంగళం కూడలిలో హర్షిత్‌రెడ్డి భారీకేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రామచంద్రపురం అక్షయ క్షేత్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి నాయకులు యోగానందరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మార్తాండ వజ్ర భైరవ హోమం



రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తి పీఠంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మార్తండ వజ్ర భైరవ హోమాన్ని హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మమవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 11వేల గారెలతో మార్తాండ వజ్ర భైరవ హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిశ్వరి రమ్యానంద భారతిస్వామి పూర్ణాహుతితోముగించారు. సాయంత్రం స్వామీజీ అనుగ్రహ బాషణం చేశారు. పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రగిరి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- ●శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.22 కోట్లు
- ●శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,560
- ●తలనీలాలు సమర్పించినవారు: 35,195

బైక్ ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన వాత్తియావీరన్

తడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని రామాపురం కుప్పం గ్రామానికి చెందిన వాత్తియా వీరన్(48) ఆదివారం రాత్రి రామా పురం బస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ నిలబడి ఉండగా చెన్నై వైపు వెళ్తున్న బైక్ అతివేగంగా వచ్చి ఢీకొంది. వాత్తియావీరన్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే ఎలాఊరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం

తడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆదివారం సాయంత్రం పూడికుప్పం వద్ద జాతీయ రహదారిపై చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు పాదచారిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలై పాదచారి మృతి చెందాడు. మృతిడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు దొరకలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కొండప నాయుడు తెలిపారు.

1.25 కిలోల గంజాయి స్వాధీనం

● మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితురాలివివరాలు తెలియజేస్తున్న పోలీసులు

నగరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ఓజీ కుప్పం గ్రామంలో కరియమాణిక్యస్వామి ఆలయం వద్ద నివాసం ఉంటున్న లింగేశ్వరి అలియాస్ జ్యోతి(47) వద్ద 1.25 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిని అరెస్టు చేసినట్లు నగరి సీఐ విక్రమ్ తెలిపారు. గతంలోనూ ఈమె గంజాయి విక్రయిస్తుండగా నగరి పోలీస్‌స్టేషన్‌లో ఐదు కేసులు, పుత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కేసు నమోదై ఉన్నాయన్నారు. ఎన్నిసార్లు హెచ్చరించినా గంజాయి విక్రయిస్తుండడంతో ఆమెపై నిఘా ఉంచి ఆదివారం అరెస్టు చేశామని సీఐ వివరించారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ నాగవరం, ఎస్ఐ విజయ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం నుంచి జారిపడి మహిళ మృతి



కళావతి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం నుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీ వద్ద జరిగింది. బీఎన్‌కండ్రిగ పోలీసులు తెలిపిన వివరాలు... తడ మండలం మాంబట్టుకు చెందిన తన ద్విచక్రవాహనంలో మునెయ్య ఆదివారం శ్రీకాళహస్తికి వెళ్లి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. మున్సిపాల్ కార్యలయం సమీపంలో బీఎన్‌కండ్రిగ మండలం వెస్ట్‌వరత్తూరుకు చెందిన కళావతి(59) ద్విచక్రవాహనంలో వస్తున్న మునెయ్యను లిఫ్ట్ అడిగింది. ఈక్రమంలో మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలో ద్విచక్రవాహనం నుంచి కళావతి జారిపడి కిందపడింది. తలకు తీవ్రగాయం కావడంతో మునెయ్య 108 అంబులెన్స్‌కు సమచారం అందించారు. ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

పంటలపై గజ బీభత్సం

● వరి, కొబ్బరి, మామిడి, పనస చెట్ల ధ్వంసం





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట-మామిడిచెట్టు

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు బాలిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. గ్రామంలోని రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, మనోజ్‌కుమార్ రెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు విరిచేశాయి. వరి పంటలను తొక్కేశాయి. పనసచెట్లను ధ్వంసం చేశాయి. కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. ఆదివారం పగలంతా ఏనుగుల గుంపు బోడబండ వద్ద సంచరించినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు తెలిపారు.

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు!



ఇటీవల జేసీబీతో ఇసుక తోడుతున్నారిలా..

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని స్వర్ణముఖినదీలో ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. జేసీబీల సాయంతో ఇసుక తవ్వేసి ట్రాక్టర్లలో నింపుకుని అక్రమంగా తరలిస్తున్నారు. గతవైసీపీ హయాంలో అలవాటుపడిన కొందరు ఇప్పుడు కూడా అదే తరహాలో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పరిమితికి మించి ఇసుక తోడేయడంతో నదిలో పలుచోట్ల భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. తొండవాడ నుంచి తిరుచానూరు వరకు నదిలోకి ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నదిలోకి చేరుకునేందుకు మార్గాలను అనువుగా చేసుకుంటున్నారు. వేదాంతపురానికి ఆనుకుని నదిలో ఇటీవల ఈతకు వెళ్లిన నలుగురు బాలురు నీటిప్రవాహ ఉధృతికి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నదిలో నిల్వచేసిన ఓ ఇసుకదిబ్బపై గల్లంతైన బాలురు సరదాగా కేరింతలు కొడుతూ ఈతకు దిగారని తెలిసింది. వర్షాలకు ముందు నదీ పరివాహక ప్రాంతంలో నాణ్యమైన ఇసుక తోడేసి కుప్పలుగా పోసి ఆరబెట్టారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత పలుగ్రామాల్లో నదిలోకి వాహనాలు చేరుకునే మార్గాలను మూసివేయాలని ఎమ్మెల్యే నాని అధికారులను ఆదేశించారు. అయినా మళ్లీ కొందరు కొందరు ఇసుకని తోడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వీరి ఫిర్యాదు మేరకు రూరల్ రెవెన్యూ అధికారులు సందర్శించారని తెలిసింది. ఇసుక తోడుతున్నవారిని గట్టిగా మందలించినట్లు సమాచారం.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయండి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



మీడియాతో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు దశాబ్దాలుగా గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, సోమశిల-కండలేరు ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సరిపడా నిధులు ప్రభుత్వాలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు సాగునీటి ప్రాజెక్టులపై ప్రేమ వొలకబోయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత అత్తెసరు నిధులు కేటాయించి చేతులు దులుపుకోవడం అలవాటైపోయిందని దుయ్యబట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ప్రతి జిల్లాకూ 100 టీఎంసీల నీరు అందించే అవకాశముందన్నారు. రూ.4వేల కోట్లు విడుదల చేస్తే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ నిర్ణయంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యసేవను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. దీంతో పేదలకు వైద్యం అందడం లేదని మండిపడ్డారు. ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ కేవీబీ పురం మండలంలో వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు సమ్మేటివ్-1 పరీక్షలు జరగనున్నాయి. ఈపరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆయా మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలకు చేరాయి. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు క్లస్టర్ రిసోర్స్ సెంటర్ హెచ్‌ఎంలకు, ఆరు నుంచి పదో తరగతి వరకు ఎంఈవోలు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రశ్నపత్రాలు ఇవ్వనున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీవరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 6,7 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, 8,9,10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ఏ రోజు ఏ సబ్జెక్టు..

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 11న తెలుగు, 12న ఇంగ్లీష్, 13న మ్యాథమెటిక్స్, 14న ఈవీఎస్ (3,4,5 తరగతులకు), 15న ఓఎస్ఎస్‌సీ (3,4,5 తరగతులకు) పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరు నుంచి టెన్త్ వరకు 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీష్, 13న మ్యాథమెటిక్స్, 14న జనరల్ సైన్స్/ఫిజికల్ సైన్స్, 15న బయలాజికల్ సైన్స్, 17న, సోషల్ స్టడీస్, 18న ఓఎస్ఎస్‌సీ పేపర్1, 19న ఓఎస్ఎస్‌సీ పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి ఆదివారం నాలుగు గంటల సమయం పట్టింది. సెలవు రోజు కావంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు పూర్తిగా నిండి పోయి ఆలయం వెలుపల వరకు వ్యాపించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.వరసిద్ధుడి ఆలయంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలను మూడ్రోజులపాటు నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయంలో పవిత్ర పూర్ణత్వసిద్ధి పొందుటకు, లోక క్షేమం కోసం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



రాహుకేతు పూజల కోసం వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆది వారం భక్తుల రద్దీ నెలకొంది. వారాం తపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 32 వేలమంది భక్తులు దర్శిం చుకున్నట్లు ఆలయ అధికారులు తెలి పారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 588 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,502, రూ.50 ప్రత్యేక దర్శన టిక్కెట్ల ద్వారా 3,186 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,154 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1.282, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 350, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 273, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 124మంది భక్తులు పూజలు చే యించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,089 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గాదంకి టోల్ ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం చంద్రగిరి పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు టోల్ ప్లాజా పోలీసులు విశాఖపట్నం నుంచి తమిళనాడుకు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో సుమారు 30 కేజీల గంజాయి బయటపడింది. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. కారు డోర్ లోపల, డ్యాష్ బోర్డు, గేర్ బాక్స్, స్టెపినీ టైర్ లోపల గంజాయిని గుర్తించారు. డ్రైవర్‌ని అరెస్ట్ చేశారు. కారును స్వాధీనం చేసుకుని పోలీసులు కేసును విచారిస్తున్నారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాలకు ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజున ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఉదయం 9.30గంటల తరువాత భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం



ఆకాశదీపానికి పూజలు చేస్తున్న ఈవో బాపిరెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాయులింగేశ్వరుడి ఆలయంలో ఆదివారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కళత్తూరులో కొనసాగుతున్న పారిశుధ్య పనులు







ఇళ్లలో మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ - సహాయక చర్యలపై ఆరాతీస్తున్న ఆర్డీవో - వస్తువులను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కేవీబీపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో 4వ రోజు ఆదివారం కూడా ఎంపీడీవో మాలతి, డిప్యూటీ ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగాయి. ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించి ట్రాక్టర్లలో నింపి ఊరి వెలుపలికి తరలించారు. అదేవిధంగా పశువుల కళేబరా లను పూడ్చి పెట్టారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

అందరికీ నిత్యావసర సరుకులు

కళత్తూరు, పాతపాళెం అరుంధతివాడ, ఎస్ఏల్‌పురంలోముంపునకు గురైన బాధితులకు శుక్రవారం నుంచి నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు. వీటిపై ఆదివారం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పంపిణీపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే పునరావాసం కొనసాగిస్తామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు వంట సామగ్రి, తాగునీటి క్యాన్ల పంపిణీ కొనసాగించాయి.

చేయూతనివ్వండి: సీపీఎం

పుత్తూరు టౌన్, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): కళత్తూరులో రాయలచెరువు ముంపు బాధితులకు చేయూత నివ్వాలని సీపీఎం నాయకులు కోరారు. పుత్తూరు పట్టణంలో ఆదివారం వస్తువులను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయ కులు దాసరి జనార్దన్, వెంకటేష్ మాట్లాడుతూ... 6వ తేదిన అకాల జల ప్రళయానికి సర్వం కోల్పోయినా బాధితులను ఆదుకోవడానికి వస్తువులు, నిత్యవసరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

భోజనం పంపిణీ

కేవీబీపురం: కళత్తూరువాసులకు స్థానిక భారత్‌గ్యాస్ యాజమాని ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కూడా ఆహారం పంపిణీ జరిగింది. రెవెన్యూ అధికారులు ప్రైవేటు సంస్థల ద్వారా భోజనాన్ని అందిస్తున్నారు. తాగునీటిని ఎప్పటికప్పుడు అందిస్తున్నామని తహసీల్దారు రోశయ్య చెప్పారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న అన్నమయ్య అన్నశాల యాజమాన్యం

తిరుపతి అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్థాన విద్వాంసులు, గానగంధర్వుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొన్నేళ్ల కిందట ఆయన చేతులు మీదుగా ప్రారంభించిన అన్నమయ్య అన్నశాల యాజమాన్యం ఆదివారం మధ్యాహ్నం అలిపిరి ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. తొలుతగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కాలినడక భక్తులకు, పేదలు, అనాథలకు దాదాపు 500మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య అన్నశాల అధినేత శివసుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ఫౌండేషన్ వ్యాసరచన పోటీల్లో ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలకు రాష్ట్రస్థాయి బహుమతి

● అభినందించిన డీఈఓ కేవీఎన్ కుమార్



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ కేవీఎన్ కుమార్ తదితరులు

తిరుపతి(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతిని అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సమకాలీన సామాజిక, రాజకీయ, సాంకేతిక, కమ్యూనికేషన్, కంప్యూటర్ కోడింగ్, ఇంగ్లిష్ ప్రతిభను మెరుగు పరిచేందుకు ప్రముఖ సామాజిక సంస్థ ఇండియా ఫౌండేషన్ ప్రతిఏటా వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అక్టోబరు 16న ఆన్‌లైన్ విధానంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు ధనుష్ కృష్ణ, గగన్ కృష్ణ, 9వ తరగతి విద్యార్థిని జ్ఞాపిక పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఫలితాలు వెలువరించగా ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతిని గెలుచుకుని రూ.27 వేల నగదు బహుమతిని, ప్రశంసా పత్రాలను అందు కున్నారు. ఈ సందర్భంగా డీఈఓ కేవీఎన్ కుమార్, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య విద్యార్థులను అభినందించారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సిప్ ఆబాకస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో తిరుచానూరు పద్మావతి కన్వెన్షన్ హాలులో ఆదివారం స్టన్నర్స్ కాంపిటీషన్ నిర్వహించారు. సుమారు 210మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు. విజేతలను అభినందించారు. సిప్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు వర్మన్, గోపాల్, జమీర్, అధినేత సునీత నాగరాజు, అసోసియేట్స్ పాల్గొన్నారు.

తిరుమలలో వైభవంగా కార్తీక వనభోజనం


పార్వేట మండపానికి బయల్దేరిన మలయప్పస్వామి, ఉభయనాంచారులు

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా తిరుమలలో ఆదివారం వనభోజన మహోత్సవాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మలయప్పస్వామిని బంగారు తిరుచ్చిపై వేంచేపు చేసి, ఆలయం నుంచి ఊరేగింపుగా వాహన మండపానికి తీసుకువచ్చారు. ఉదయం 8.30 గంటలకు సమర్పణ అనంతరం మలయప్పస్వామిని చిన్న గజ వాహనంపై, మరో పల్లకిపై ఉభయనాంచారులను రంగనాయక మండపం నుంచి పార్వేట మండపానికి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్నపన తిరుమంజనం కనులపండువగా నిర్వ హించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్ తరఫున భక్తి సంగీత కార్యక్రమాలు, హరికథలు ఏర్పాటు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో లోక నాథం, బోర్డు సభ్యుడు సదాశివరావు పాల్గొన్నారు.


వనభోజనాలు చేస్తున్న భక్తులు

రుద్రాభిషేకం ఆలస్యంతో భక్తుల అవస్థలు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం సేవ నాలుగు గంటలు ఆలస్యం కావడంతో భక్తులకు అవస్థలు తప్పలేదు. ముక్కంటి ఆలయంలో రోజూ నాలుగు కాలాల పాటు రుద్రాభిషేకం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో మూడో కాలానికి తప్ప మిగతా అభిషేకాలకు భక్తులను అనుమతిస్తుంటారు. వారాంతపు సెలవులతోపాటు ఆదివారం పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర తోడవడంతో అధిక సంఖ్యలో భక్తులు రుద్రాభిషేకం జరిపించుకునేందుకు టికెట్లు కొనుగోలు చేశారు. రెండో కాల అభిషేకం కోసం ఉదయం 5.30 గంటలకు భక్తులు వచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ముందుగా లక్ష కుంకుమార్చన పూజలను ప్రారంభించారు. దాన్ని కారణంగా చూపుతూ నాలుగు గంటల పాటు రుద్రాభిషేకం భక్తులు నిరీక్షించేలా చేశారు. దీంతో వృద్ధులు, పిల్లల తల్లులు అవస్థలు పడ్డారు. అధికారుల తీరుపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


రుద్రాభిషేకం కోసం నిరీక్షిస్తున్న భక్తులు

మహిళ అదృశ్యం


అదృశ్యమైన సుచరిత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ బైరాగి పట్టెడలో ఉంటున్న సుబ్రహ్మణ్యం భార్య తిరుమణ్యం సుచరిత శనివారం ఇంట్లో పిల్లలపై అలిగి ఎక్కడికో వెళ్లిపోయింది. ఈమె ఐదు అడుగుల ఎత్తు, ఫ్లోరోసెంట్ బ్లూ కలర్ చీర, బ్లూ కలర్ జాకెట్ ధరించి ఉంది. ఈమె ఆచూకీ తెలిసిన వారు 9492256999కు కానీ లేకుంటే రూరల్ సీఐ 9491074525కు కాల్‌చేసి సమా చారం ఇవ్వాలని కోరారు.

లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌కు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న దేవికుమారి

తిరుపతి అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఆదివారం స్థానిక ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) ఆధ్వర్యంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా సీపీఓ దేవికుమారి, సాంకేతిక నిపుణులు వంశి, సందీప్ పాల్గొని సాఫ్ట్‌వేర్‌లో వచ్చిన మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో టేప్ ఛైర్మన్ టి.వెంకటేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్స్ సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ బి.షణ్ముగం, బంగారయ్య, శివశంకర్‌రెడ్డి, నరేష్, సురేష్, వసంతరావు, కిషోర్, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ రాజీనామా ఆమోదంపై హైకోర్టు స్టే

ఇన్‌ఛార్జి బాధ్యతల స్వీకరణపై పోలీసులకు ఫిర్యాదు

వరదయ్యపాళెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పద్మప్రియ రాజీనామాను ఆమోదిస్తూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. తన రాజీనామాను రెండో వ్యక్తి ద్వారా అందుకున్న జడ్పీ సీఈవో తనకు నోటీసులు ఇవ్వకుండా, కనీసం విచారణ చేపట్టకుండా ఆమోదిస్తూ కలెక్టర్‌కు సిఫారసు చేశారని ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కలెక్టర్ ఉత్తర్వులపై హైకోర్టు ఈనెల 5న స్టే విధించగా 7వ తేదీన వైస్ ఎంపీపీ బొప్పన పద్మావతి తన ఛాంబర్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఇన్‌ఛార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారంటూ పద్మప్రియ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భవిష్యత్తు కమ్యూనిస్టులదే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యను తిరుపతి బాలాజీ కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రత్యామ్నా య రాజకీయ శక్తిగా అవతరించనున్నారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలు ఒక తాటిపైకి రావాల్సిన అవసరం పెరిగిందన్నారు. పోరాటంతో పాటు చట్టసభల్లో అడుగుపెట్టి, దళిత, గిరిజన, బహుజన వర్గాల గొంతుకగా నిలవాలని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. ఫాసిస్టు వ్యవస్థ రాజ్యమేలుతోందని విమర్శించారు. ఎవరు ఏమి తినాలో, ఏ బట్ట కట్టాలో, ఏం రాయాలో కూడా నిర్ణయించే స్థాయికి వచ్చారన్నారు. పుస్తకాలలో పాఠ్యాంశాలను మార్చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. కగార్ పేరుతో గిరిజన ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీల్లో పదవి అలంకారం కాదని, అదొక బాధ్యత అని అన్నారు. అనంతరం మాజీ నాయకులు ఈశ్వరయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేతలు తులసేంద్ర, జిల్లా కార్యదర్శి మురళి, ప్రజానాట్య మండలి కార్యదర్శి పెంచలయ్య, నగర కార్యదర్శి విశ్వనాథ్, మాజీ నాయకులు విజయ్ భాస్కర్, శివారెడ్డి, రాజారెడ్డి, మాజీ నాయకుడు, ప్రముఖ నటుడు రాజమౌళి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌రాజు, అరసం నేత సాకంనాగరాజు, రచయిత వాకా ప్రసాద్ పాల్గొన్నారు.

ముక్కంటీశుడికి లక్ష బిల్వార్చన



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వేదోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన వేడుకలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్పం పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు రుత్వికులు అర్చనలు చేశారు. సాయంత్రం నాల్గో కాలం అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, సభ్యులు, ప్రధాన అర్చకులు, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

కళా సంపదను భావితరాలకు అందించాలి

● అన్నమయ్య సంగీత, నృత్యోత్సవంలో వక్తల పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గ్లోబల్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా మహతి కళాక్షేత్రంలో చేపట్టిన అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ సంగీత, నృత్యోత్సవాలలో రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి సుమారు 300 మందికి పైగా కళాకారులు పాల్గొని శాస్త్రీయ సంగీతాలాపన, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగింపు సమావేశానికి ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోకుమార్, టీడీపీ నేతలు కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, సిటీ ఛాంబర్ ప్రతినిధి అయూబ్ ఖాన్ పాల్గొని ప్రసంగించారు. సంప్రదాయ కళలు కనుమరుగవుతున్న నేపథ్యంలో అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలతో కళాకారులు, కళలను గ్లోబల్ ఈవెంట్స్ అధినేత కదిరి వెంకటరమణరావు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కళా ప్రదర్శనలు మరింత విస్తృతం చేస్తూ శాస్త్రీయ సంగీత, నృత్య కళల విశిష్టతను చాటాలని తెలిపారు. అనంతరం కళాకారులను, నాట్య గురువులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఈ వెంట్స్ అధినేత వెంకటరమణరావు, ఇరముని శేఖర్, కళాకారులు, నాట్య గురువులు పాల్గొన్నారు.

అక్కడ మళ్లీ నిర్మాణం

● కొరమేనుగుంట శ్మశాన దారి స్థలంపై మళ్లీ వివాదం
● గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనంతో నిర్మాణాన్ని కూల్చిన తహసీల్దార్

తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతి అర్బన్ మండలం సర్వే నెంబరు 53, 54లలోని స్థలాన్ని ఎన్నో ఏళ్లుగా కొరమేనుగుంట ప్రాంత వాసులు శ్మశానానికి వినియోగిస్తున్నారు. అయి తే ఆప్రాంతంలో గత వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన మాస్టర్ ప్లాన్ రోడ్డు వలన కొందరు కబ్జాదారుల కన్ను శ్మశానంపై పడింది. 8 నెలల క్రితం దారిలేకుండా గోడ కట్టేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదయ్యాయి. గోడను తొలగించాలని అధికారులతో మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. హఠాత్తుగా గోడ కట్టిన చోటరేకులతో చిన్న గదిని నిర్మించారు. ఇకచేసేదిలేక గ్రామస్తులు ఆంధ్ర జ్యోతి దృష్టికి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 28న 'శ్మశానానికి దారేది' శీర్షికన ఆంధ్ర జ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. అప్పటి తహసీల్దార్ భాగ్యలక్ష్మి క్షేత్రస్థాయిలో పరిశీలించి అది శ్మశానానికి సంబంధించిన స్థలంగా నిర్ధారించి సిబ్బందితో నిర్మాణాలను తొలగించారు. ఇటీవల ఆమె బదిలీపై వెళ్లి కొత్త తహసీల్దార్ రావడంతో అక్కడ మళ్లీ పనులు మొదలయ్యాయి. రాత్రికి రాత్రే వివాదాస్పద స్థలంలో గదిని నిర్మించేశారు. రెండు రోజులు సెలవులు రావడంతో చకచకా పనులు పూర్తిచేశారు. అడ్డుకోబోయిన గ్రామస్తులను కేసులతో బెదిరించినట్టు తెలిసింది.



ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయ్యేనా..?

తిరుపతి (సెంట్రల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు నుంచి పాత తిరుచానూరు రోడ్డులోకి భక్తులు, ప్రయాణికులు, స్థానికులు, విద్యుత్ వినియోగదారులు వెళ్లడానికి ఉన్న రైల్వే గేటుకు ప్రత్యామ్నాయంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జినిర్మాణాలు ఎప్పటికి పూర్తిచేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. డీఆర్ మహల్ అండర్ బ్రిడ్జి పూర్తి చేసిన తర్వాత వెంకటేశ్వర గేటును మూత వేశారు. అప్పటి నుంచి ప్రజలు రెండు వైపులకు వెళ్లడానికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని పోరాటం చేశారు. తిరుపతి ఎంపీ తమ అభివృద్ధి నిధుల నుంచి రూ.50 వేలు కేటాయిస్తామని రైల్వే అధికారులకు హామీ ఇచ్చారు. అయినా ఫలితం లేదు. గత ఏడాది ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి రైల్వే, నగర పాలక అధికారులు అంగీకరించారు. యుద్ధప్రాతిపదికన నిర్మించాలని కాంట్రాక్టర్లకు పనులు అప్పగించగా, నత్తనడకన సాగుతున్నాయి. రెండువైపులా పనులు చేపట్టారు. పైన బ్రిడ్జి వేయడానికి రైల్వే అధికారులు సిద్ధంగా ఉన్నా కాంట్రాక్టరు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వున్నాయి. నిర్మాణాలకు సంబంధించిన ఇనుప వస్తువులు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపడుతున్నాయి. ఇప్పటికైనా నగర పాలక కమిషనర్ స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి చేయించాలని ఇక్కడి జనం కోరుతున్నారు.


వెంకటేశ్వర థియేటర్ వద్ద అర్ధాంతరంగా ఆగివున్న ఫుట్ ఓవర్ బిడ్జి నిర్మాణ పనులు

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏం జరుగుతోంది?

● వివాదాలపై ఎమ్మెల్యే ఆరా

తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నెలకొన్న వివాదాలపై ఇటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు ఉన్నతాధికారులు ఆరాతీసినట్టు తెలిసింది. ఆస్పత్రిలో ఇంకా వైసీపీ ఆధిపత్యం పోలేదని కొందరు వైద్యాధికారులు వారికే కొమ్ముకాస్తూ ఉన్నారని ఎమ్మెల్యే దృష్టికి వచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ వైఖరిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇంతకుముందున్న ఓ సూపరింటెండెంట్ వైసీపీకి అనుకూలమైన వ్యక్తిగా ముద్రపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతను బదిలీపై వైజాగ్ వెళ్లారు. ఇక్కడ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ ప్రమీలాదేవి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. అయితే గత సూపరింటెండెంట్ చెప్పినట్టే ఇప్పటికీ నడుచుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే ఓ సీనియర్ అసిస్టెంట్ నాలుగు నెలల క్రితం కడపకు బదిలీ చేశారు. నెల తిరగకముందే అతని సేవలు ఇక్కడ అవసరమని డిప్యుటేషన్‌పై తెచ్చుకున్నారు. ఆడిట్‌లో జరిగిన అవకతవకలను సరిచేందుకే అతడిని తెప్పించుకున్నట్టు విమర్శలు వచ్చాయి. ఆడిట్ పూర్తవ్వగానే రిలీవ్ చేయాలని అక్టోబరు 6న రీజనల్ డైరెక్టర్ లిఖితపూర్వకంగా ఆదేశాలిచ్చినా వినిపించుకోలేదని తెలుస్తోంది. ప్రసూతి ఆస్పత్రిలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్‌లు ఉన్నప్పటికీ వాళ్లను కాదని పాత వ్యక్తిని రప్పించుకోవడం వెనుక మతలబు ఏంటో అర్థం కావడంలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అధికారిక ఫోన్ కూడా ఇతని దగ్గరే ఉంటుందని ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినా స్పందించరన్న విమర్శలు ఉన్నాయి. హెచ్‌డీఎస్ అప్రూవల్ లేకుండానే ఇక్కడి క్యాంటీన్ కూడా సదరు వ్యక్తికే కట్టబెట్టారని తెలుస్తోంది. అదేవిధంగా మరో క్లర్క్ ప్రసూతి ఆస్పత్రిలో అనధికారికంగా విధులు నిర్వహించినట్టు సమాచారం.

ముంపు ప్రభావిత పాఠశాలల పరిశీలన

కేవీబీపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓళ్లూరు చెరువు గండి పడడంతో ముంపునకు గురైన కళత్తూరు, హరిజనవాడ, ఎస్ఎల్‌పురం, పాతపాళెం పాఠశాలలను డీఈవో కేవీఎన్ కుమార్ పరిశీలించారు. పాఠశాలలో పేరుకుపోయిన బురద తొలగించే పనులను పర్యవేక్షించారు. రికార్డులు దెబ్బతిన్న నేపథ్యంలో పునరుద్ధరణకు ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. విద్యాసామగ్రి, యూనిఫాం సహా ఇతర వసతులను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న కళత్తూరు హరిజనవాడకు చెందిన విద్యార్థుల ఇళ్లను ఆదివారం సందర్శించారు. వారి పుస్తకాలు, బ్యాగులను శుభ్రం చేశారు. నానిపోయిన పుస్తకాల స్థానంలో కొత్తవి అందిస్తామని ఆయన తెలిపారు.


కళత్తూరు పాఠశాల వద్ద డీఈవో కుమార్

ప్రమాదకరంగా కల్వర్టు



రక్షణగోడ కూలిపోయిన కల్వర్టు

గూడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయుడుకాలువ కట్ట ప్రాంతంలోని కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. కాలువపై గతంలో నిర్మించిన కల్వర్టు రక్షణగోడలు కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గం ద్వారా నాయుడుకాలువకట్ట, రాణిపేట తదితర ప్రాంతాలకు చెందిన స్థానికులు పాతబస్టాండు వైపు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుకు రక్షణగోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవలేదు. రాత్రి సమయాల్లో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నారులు ఆడుకునే సమయంలో, రాత్రి వేళలో వృద్ధులు కల్వర్టు వద్ద కాలువలో పడి క్షతగాత్రులయ్యారు. అధికారులు స్పందించి కల్వర్టకు రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



మాలయకోటవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు చెప్పారు. పట్టణ పరిధిలోని మాలయకోటలో ఆదివారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ బయట ప్రాంతాల నుంచి ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాలు నడిపేవారు అన్ని ధృవీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, ఎస్ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో...



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామ సుందరపురంలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ జరిగింది. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు ఎస్ఐలు పవన్ కుమార్, నాగబాబు, చిన్నబలరామయ్య, ట్రైనీ ఎస్ఐ నిఖిల్ దాడులు నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని 25 బైక్‌లు, ఆటోలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

శాస్త్రోక్తంగా మార్తాండ వజ్ర భైరవ హోమం



రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తి పీఠంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మార్తండ వజ్ర భైరవ హోమాన్ని హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మమవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 11వేల గారెలతో మార్తాండ వజ్ర భైరవ హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిశ్వరి రమ్యానంద భారతిస్వామి పూర్ణాహుతి తోముగించారు. సాయంత్రం స్వామీజీ అనుగ్రహ బాషణం చేశారు. పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతులకు పూలంగి సేవ



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపాన అగస్త్యేశ్వరాలయంలో రుద్రపాదాల ము క్కోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతులకు ఘ నంగా పూలంగి సేవను నిర్వహించారు. ఉదయం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లిదేవికి అభిషేకం నిర్వహించాక దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులను నంది వాహనంపై అధిష్టింపజేసి భక్తులకు దర్శనమిచ్చారు. 10 గంటలకు ఉత్సవర్లను విశేషంగా అలంకరిం సుగంధభరిత పుష్పాలతో పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. రాత్రి స్వామిఅమ్మవార్లు రావణాసుర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌కు అవగాహన సదస్సు

తిరుపతి అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఆదివారం స్థానిక ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) ఆధ్వర్యంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా సీపీఓ దేవికుమారి, సాంకేతిక నిపుణులు వంశి, సందీప్ పాల్గొని సాఫ్టవేర్‌లో వచ్చిన మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో టేప్ ఛైర్మన్ టి.వెంకటేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్స్ సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ బి.షణ్ముగం, బంగారయ్య, శివశంకర్‌రెడ్డి, నరేష్, సురేష్, వసంతరావు, కిషోర్, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన వాత్తియావీరన్

తడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని రామాపురం కుప్పం గ్రామానికి చెందిన వాత్తియా వీరన్(48) ఆదివారం రాత్రి రామాపురం బస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ నిలబడి ఉండగా చెన్నై వైపు వెళ్తున్న బైక్ అతివేగంగా వచ్చి ఢీకొంది. వాత్తియావీరన్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే ఎలావూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆదివారం సాయంత్రం పూడికుప్పం వద్ద జాతీయ రహదారిపై చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు పాదచారిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలై పాదచారి మృతి చెందాడు. మృతిడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు దొరకలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కొండప నాయుడు తెలిపారు.



హోలిక్రాస్ సర్కిల్ సమీపంలో జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన లారీలు - ఆర్టీవో కార్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆపిన వాహనాలు

హైవే పైనే వాహనాల పార్కింగ్

ట్రాఫిక్‌తో పాటు రాత్రిపూట ప్రమాదాలు ● పట్టించుకోని పెట్రోలింగ్ పోలీసులు

సూళ్లూరుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో జాతీయ రహదారిపై, పట్టణంలోని ఇతర ప్రదేశాల్లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామిక వాడలకు వెళ్లే ట్రావెల్స్ బస్సులు, మినీ వ్యాన్‌లు సూళ్లూరుపేట హోలిక్రాస్ కూడలి నుంచి కోటపోలూరు క్రాస్ రోడ్డు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా ఆపేస్తున్నారు. అలాగే సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలతో పాటు లారీలు బారులు తీరుతున్నాయి. దీనికి తోడు హోటళ్లు, దాబాల వద్ద ఉదయం, మధ్నాహ్నం, రాత్రి సమయాల్లో వాహనాలతో పాటు లారీలు బారులు తీరుతున్నాయి. దీంతో ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. శని, ఆదివారాల్లో కంపెనీలకు సెలవు కావడంతో ఆ పరిశ్రమలకు వెళ్లే వాహనాలన్నింటినీ జాతీయ రహదారి పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. ఇక హోలిక్రాస్ సర్కిల్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని ఓ వేబ్రిడ్జి వద్ద రాంగ్‌రూట్‌లో లారీలు పార్కింగ్ చేయడంతో ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. రాంగ్‌రూట్‌లో పార్కింగ్ చేయడం వల్ల సర్వీసు రోడ్డు, ఇళ్ల వద్ద నుంచి వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలో ఆర్టీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో కూడా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యర్థాలు తొలగవు.. మురుగు పారదు

కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు



లూథరన్ చర్చి వద్ద ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన మురుగుకాలువ - వినాయకుడిగుడి వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారి జీఎన్‌టీ రోడ్డుకు రెండువైపులా ఉన్న మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో ఎక్కడ చూసిన వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్రధానం జీఎన్‌టీ రోడ్డులో రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి వినాయకుడి గుడి సెంటర్, హోలిక్రాస్ కూడలి వరకు మురుగు కాలువలు వ్యర్థాలతో నిండి పూడిపోయాయి. కాలువల్లో మురుగునీరు కదలక రోడ్లపై, నివాసాల నడుమ చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతోంది. కాలువల్లో పూడికతో చిన్నపాటి వర్షమొచ్చినా నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. సాక్ష్యాత్తు మున్సిపాలిటీ కార్యాలయం వద్దే పరిస్థితి దారుణంగా ఉంది. వర్షమొచ్చినప్పుడు ఎక్సకవేటర్లతో పూడిక తీయించి వదిలేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. జీఎన్‌టీ రోడ్డు లూథరన్ చర్చి ఆనుకుని ఉన్న కాలువ ప్లాస్టిక్ కవర్ల నిండి పూడిపోయింది. అదే విధంగా ఇవతలి వైపు కాలువలో పోలీసుస్టేషన్ వద్ద, వినాయకుడిగుడి సెంటర్‌లో కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి మురుగు కదలడం లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పూడిక తీయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో వ్యర్థాలను తొలగించి మురుగు కదిలేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్తు కమ్యూనిస్టులదే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



అభినందన సభలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యను తిరుపతి బాలాజీ కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అవతరించనున్నారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలు ఒక తాటిపైకి రావాల్సిన అవసరం పెరిగిందన్నారు. పోరాటంతో పాటు చట్టసభల్లో అడుగుపెట్టి, దళిత, గిరిజన, బహుజన వర్గాల గొంతుకగా నిలవాలని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. ఫాసిస్టు వ్యవస్థ రాజ్యమేలుతోందని విమర్శించారు. ఎవరు ఏమి తినాలో, ఏ బట్ట కట్టాలో, ఏం రాయాలో కూడా నిర్ణయించే స్థాయికి వచ్చారన్నారు. పుస్తకాలలో పాఠ్యాంశాలను మార్చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. కగార్ పేరుతో గిరిజన ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీల్లో పదవి అలంకారం కాదని, అదొక బాధ్యత అని అన్నారు. అనంతరం మాజీ నాయకులు ఈశ్వరయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేతలు తులసేంద్ర, జిల్లా కార్యదర్శి మురళి, ప్రజానాట్య మండలి కార్యదర్శి పెంచలయ్య, నగర కార్యదర్శి విశ్వనాథ్, మాజీ నాయకులు విజయ్ భాస్కర్, శివారెడ్డి, రాజారెడ్డి, మాజీ నాయకుడు, ప్రముఖ నటుడు రాజమౌళి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌రాజు, అరసం నేత సాకం నాగరాజ, రచయిత వాకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ రాజీనామా ఆమోదంపై హైకోర్టు స్టే

ఇన్‌ఛార్జి బాధ్యతల స్వీకరణపై పోలీసులకు ఫిర్యాదు

వరదయ్యపాళెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పద్మప్రియ రాజీనామాను ఆమోదిస్తూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. తన రాజీనామాను రెండో వ్యక్తి ద్వారా అందుకున్న జడ్పీ సీఈవో తనకు నోటీసులు ఇవ్వకుండా, కనీసం విచారణ చేపట్టకుండా ఆమోదిస్తూ కలెక్టర్‌కు సిఫారసు చేశారని ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కలెక్టర్ ఉత్తర్వులపై హైకోర్టు ఈనెల 5న స్టే విధించగా 7వ తేదీన వైస్ ఎంపీపీ బొప్పన పద్మావతి తన ఛాంబర్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఇన్‌ఛార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారంటూ పద్మప్రియ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాశిం జశ్వంత్‌కు పలువురి అభినందనలు

వాకాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని మహాత్మాగాంధీ యూనివర్శిటీలో ఎండీ (జనరల్ మెడిసెన్) చదువుతున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తనయుడు జశ్వంత్‌కుమార్‌కు యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్‌ను సాధించాడు. అతడికి టీడీపీ మండల నాయకుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, కల్లూరు హరీష్‌నాయుడు, దువ్వూరు జనార్ధన్‌రెడ్డి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు అభినంద నలు తెలిపారు.

బామ్‌సెఫ్ కార్యాలయం ప్రారంభం



బామ్‌సెఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

నాయుడుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ భవనం సమీపంలో డీజే రాజు కాంప్లెక్స్‌లో బామ్‌సెఫ్(బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్) కార్యాలయాన్ని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పేర్నాటి వెంకటేశ్వర్లు, సీనియర్ ఉద్యోగులు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బందిలి శ్రీనివాసులు, నలమాకుల శ్రీనివాసులు, జడ్డా వెంకటరావు, రామకృష్ణ, డీవీ కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిక్సిడ్ కాలనీకి చెందిన పోలమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ రూ.మూడు వేలు మాజీ సర్పంచు రామ్మూర్తి, స్థానిక నేతలు సూర్యనారాయణ, మోహన్ ద్వారా పోలమ్మ కుటుంబసభ్యులకు అందజేశారు.

ముక్కంటీశుడికి లక్షార్చన



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వేదోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన వేడుకలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్పం పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు రుత్వికులు అర్చనలు చేశారు. సాయంత్రం నాల్గో కాలం అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, సభ్యులు, ప్రధాన అర్చకులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకం ఆలస్యంతో భక్తుల అవస్థలు



రుద్రాభిషేకం కోసం నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం సేవ నాలుగు గంటలు ఆలస్యం కావడంతో భక్తులకు అవస్థలు తప్పలేదు. ముక్కంటి ఆలయంలో రోజూ నాలుగు కాలాల పాటు రుద్రాభిషేకం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో మూడో కాలానికి తప్ప మిగతా అభిషేకాలకు భక్తులను అనుమతిస్తుంటారు. వారాంతపు సెలవుల తోపాటు ఆదివారం పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర తోడవడంతో అధిక సంఖ్యలో భక్తులు రుద్రాభిషేకం జరిపించుకునేందుకు టికెట్లు కొనుగోలు చేశారు. రెండో కాల అభిషేకం కోసం ఉదయం 5.30 గంటలకు భక్తులు వచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ముందుగా లక్ష కుంకుమార్చన పూజలను ప్రారంభించారు. దాన్ని కారణంగా చూపుతూ నాలుగు గంటల పాటు రుద్రాభిషేకం భక్తులు నిరీక్షించేలా చేశారు. దీంతో వృద్ధులు, పిల్లల తల్లులు అవస్థలు పడ్డారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కళా సంపదను భావితరాలకు అందించాలి

అన్నమయ్య సంగీత, నృత్యోత్సవంలో వక్తల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గ్లోబల్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా మహతి కళాక్షేత్రంలో చేపట్టిన అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ సంగీత, నృత్యోత్సవాలలో రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి సుమారు 300 మందికి పైగా కళాకారులు పాల్గొని శాస్త్రీయ సంగీతాలాపన, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగింపు సమావేశానికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోకుమార్, టీడీపీ నేతలు కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, సిటీ చాంబర్ ప్రతినిధి అయూబ్ ఖాన్ పాల్గొని ప్రసంగించారు. సంప్రదాయ కళలు కనుమరుగవుతున్న నేపథ్యంలో అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలతో కళాకారులు, కళలను గ్లోబల్ ఈవెంట్స్ అధినేత కదిరి వెంకట రమణరావు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కళా ప్రదర్శనలు మరింత విస్తృతం చేస్తూ శాస్త్రీయ సంగీత, నృత్య కళల విశిష్టతను చాటాలని తెలిపారు. అనంతరం కళాకారులను, నాట్య గురువులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఈవెంట్స్ అధినేత వెంకటరమణరావు, ఇరముని శేఖర్, కళాకారులు, నాట్య గురువులు పాల్గొన్నారు.









ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


రాహుకేతు పూజల కోసం వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 32 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 588 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,502, రూ.50 ప్రత్యేక దర్శన టిక్కెట్ల ద్వారా 3,186 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,154 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,282, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 350, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 273, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 124మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,089 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి పూజలు


హోమం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజుంజి వినాయక స్వామి ఆలయం వద్ద సంకట చతుర్థశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతిహోమం నిర్వహించుకునే విధంగా ఆలయ అధికారులు సంకట చతుర్థశి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం అంజి అంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన పూజలు నిర్వహించి గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ముచ్చెలి గ్రామ హరిజనవాడలో టీడీపీ సీనియర్ నాయకుడు మద్దిల రంగయ్య సతీమణి ఇటీవల మరణిం చారు. ఆదివారం వారి స్వగృహం వద్ద కర్మ క్రియలు జరిగాయి. ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పుత్తూరు వార్తలు

బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే భాను


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వడమాలపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు, కార్యకర్తల కుటుంబాలకు ఆరోగ్య సేవలు, ఆర్థిక సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం అండగా ఉం టుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. వడమాలపేటలో జరిగిన కార్యక్రమంలో పలువురికి ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అప్పలాయగుంటకు చెందిన టి.చెంగమ్మకు రూ.20,000, టి.సి.అగ్రహారానికి చెందిన బి.మునికుమార్‌కు రూ.1,25,960, బట్టీకండ్రిగకు చెందిన పి.మణికి రూ.35,900, ఎనమలపాళెంకు చెందిన మునస్వామికి రూ.25,000 చెక్కులను అందచేశారు. దాముయాదవ్, ధనంజయులు నాయుడు, వెంకటయ్య, శివ, హేమావతి, వివేక్, రఘు, సుబ్రహ్మణ్యం యాదవ్, మునిరెడ్డి, రమేష్, రవిరెడ్డి, రాధాకృష్ణమ రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సహాయం అందించండి

● న్యాయ సేవా దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులుగా పేదలకు న్యాయ సహాయం అందించాలని న్యాయ విద్యార్థులకు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర దిశా నిర్దేశం చేశారు. ఆదివారం స్థానిక న్యాయ కళాశాలలో న్యాయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయవాద వృత్తి ప్రజల హక్కులు, మానవ హక్కులకు రక్షణ కల్పిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయసేవాధికార సంస్థ కట్టుబడి ఉందన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులతో పాటు మధ్యవర్తిత్వాన్ని నిర్వహించి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. చట్టాల పట్ల అవగాహన కోసం ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. బీఈడీ చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. పుత్తూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్ బాబు, కళాశాల చైర్మన్ నరసింహులు, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమనీయం... పార్వతీపరమేశ్వరుల కల్యాణం



వడమాలపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీశంకర ఆలయంలో పుష్కర కుంభాభిషేక త్రిదిన వార్షికోత్సవాల్లో చివరి రోజు ఆదివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం శివనామ స్మరణలతో కమనీయంగా సాగింది. ఉదయం అగ్నిహోమం నిర్వహించి 108 కలశాలతో పవిత్ర గంగాజలం, విశేష ద్రవ్యాలతో మహా శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశివుడిని విశేషంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పూలమాలలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టుపీతాంబరాలతో వధూవరులుగా అలంకరించారు. అర్చకులు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణల నడుమ మాంగళ్యధారణ చేయించారు. నూతన వధువరులతో తలంబ్రాలు పోయించారు. తీర్థప్రసాద వినియోగం, అన్నదానం జరిగాయి.

డివైడర్లకు పెయింటింగ్



పుత్తూరు అర్బన్, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు టీడీపీ వార్డు ఇన్‌ఛార్జి కృష్ణకుమార్ చొరవ తీసుకున్నారు. జీజీఎన్ నగర్‌లో ఏఎండీ ఫంక్షన్ హాల్ పక్కన వెళ్లే మార్గంలో గుర్తించలేని విధంగా ఉన్న స్పీడ్ బ్రేకర్‌తో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్పందించిన కృష్ణకుమార్ వ్యక్తిగత నిధులతో పెయింటింగ్ వేయించారు. రవి, పెంచలయ్య, మురళి, మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

కళత్తూరువాసులకు చేయూతనివ్వండి: సీపీఎం


వస్తువులను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): కళత్తూరులో రాయలచెరువు ముంపు బాధితులకు చేయూత నివ్వాలని సీపీఎం నాయకులు కోరారు. పుత్తూరు పట్టణంలో ఆదివారం వస్తువులను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దాసరి జనార్దన్, వెంకటేష్ మాట్లాడుతూ... 6వ తేదిన అకాల జల ప్రళయానికి సర్వం కోల్పోయినా బాధితులను ఆదుకోవడానికి వస్తువులు, నిత్యవసరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. రమేష్, మునిశంకర్, మురుగేష్, అముదా, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా ప్రాంగణంలో ఆక్రమిత స్థలాన్ని ఆదివారం ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళ ప్రాంగణ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

కళత్తూరులో కొనసాగుతున్న పారిశుధ్య పనులు




ఇళ్లలో మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ - సహాయక చర్యలపై ఆరాతీస్తున్న ఆర్డీవో - కళత్తూరు పాఠశాల వద్ద డీఈవో కుమార్

కేవీబీపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో 4వ రోజు ఆదివారం కూడా ఎంపీడీవో మాలతి, డిప్యూటీ ఎంపీడీవో కరుణాకర్రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగాయి. ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించి ట్రాక్టర్లలో నింపి ఊరి వెలుపలికి తరలించారు. అదేవిధంగా పశువుల కళేబరాలను పూడ్చి పెట్టారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

అందరికీ నిత్యావసర సరుకులు

కళత్తూరు, పాతపాళెం అరుంధతివాడ, ఎస్ఎల్‌పురంలోముంపునకు గురైన బాధితులకు శుక్రవారం నుంచి నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు. వీటిపై ఆదివారం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పంపిణీపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే పునరావాసం కొనసాగిస్తామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు వంట సామగ్రి, తాగునీటి క్యాన్ల పంపిణీ కొనసాగించాయి.

ముంపు ప్రభావిత పాఠశాలల పరిశీలన

ఓళ్లూరు చెరువు గండి పడడంతో ముంపుకు గురైన కళత్తూరు, హరిజనవాడ, ఎస్ఎల్‌పురం, పాతపాళెం పాఠశాలలను డీఈవో కేవీఎన్ కుమార్ పరిశీలించారు. పాఠశాలలో పేరుకుపోయిన బురద తొలగించే పనులను పర్యవేక్షించారు. రికార్డులు దెబ్బతిన్న నేపథ్యంలో పునరుద్ధరణకు ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. విద్యాసామగ్రి, యూనిఫాం సహా ఇతర వసతులను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న కళత్తూరు హరిజనవాడకు చెందిన విద్యార్థుల ఇళ్లను ఆదివారం సందర్శించారు. వారి పుస్తకాలు, బ్యాగులను శుభ్రం చేశారు. నానిపోయిన పుస్తకాల స్థానంలో కొత్తవి అందిస్తామని తెలిపారు.

అన్నింటికీ చెరువునీరే దిక్కు



కేవీబీపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరువాసులకు గత నాలుగు రోజులుగా కళత్తూరు పెద్ద చెరువే దిక్కయ్యింది. పారుతున్న కలుజు వద్ద ప్రజలు సామాన్లు, దుస్తులు శుభ్రం చేసుకుంటున్నారు. అలాగే స్నానాలు కూడా చేసుకుంటున్నారు.

భోజనం పంపిణీ



కేవీబీపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరువాసులకు స్థానిక భారత్‌గ్యాస్ యాజమాని ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కూడా ఆహారం పంపిణీ జరిగింది. దీంతో పాటు రెవెన్యూ అధికారులు ప్రైవేటు సంస్థల ద్వారా భోజనాన్ని అందిస్తున్నారు. తాగునీటిని ఎప్పటికప్పుడు అందిస్తున్నామని తహసీల్దారు రోశయ్య చెప్పారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాయులింగేశ్వరుడి ఆలయంలో ఆదివారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశ దీపాన్ని దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ఏర్పేడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలిక రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారికోసం వృద్ధురాలి భూ పోరాటం

సత్యవేడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం అడవికొడియం బేడులో గ్రామకంఠం భూములను ఆక్రమించి నిర్మాణాలు చేస్తూ తన భూమిలోకి వెళ్లేందుకు దారి లేకుండా చేశారని, న్యాయం చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన వృద్ధురాలు దమయంతి అధికారులను వేడుకుంటున్నారు. కొద్ది నెలలుగా ఈ విషయంపై పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. సర్వే నెం.90-6లోని గ్రామకంఠం భూములను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాజకీయ పలుకుబడితో ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అక్రమ నిర్మాణంతో తన భూముల్లోకి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని పీజీఆర్ఎస్‌లో, సత్యవేడు పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు తన పట్టాభూముల్లోకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ఆక్రమణలను తొలగించి 12 అడుగుల దారి ఏర్పాటు చేసినట్లు మంత్రికి రిప్లై ఇచ్చేశారని తెలిపారు. అయితే నేటికి ఆక్రమణలు తొలగించకుండా ఆక్రమణదారుడితో సంబంధిత అధికారులు లాలూచి పడి అన్యాయం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

శంకర్‌రెడ్డిపై తెలుగు తమ్ముళ్ల అసమ్మతి గళం!

సత్యవేడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డిపై పలువురు తెలుగు తమ్ముళ్లు తిరుగుబాటు జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ నేతలు కొందరు పార్టీ పెద్దలు పలువురిని కలిసి శంకర్‌రెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నివాస గృహంలో మండలంలోని టీడీపీ నేతలు అత్యవసర సమావేశం నిర్వహించి శంకర్‌రెడ్డి వైఖరిపై అసమ్మతి గళం వినిపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఇటీవల పార్టీలోకి వచ్చిన వైసీపీ జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, ఆమె భర్త చంద్రశేఖర్ రెడ్డి వారి అనుచరులకు, గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థికి పనిచేసిన వెన్నుపోటుదారులను శంకర్‌రెడ్డి ప్రోత్సహిస్తూ నిజమైన పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రశేఖర్‌రెడ్డి మద్దతుదారులు మండలంలో పెత్తనం చెలాయిస్తూ టీడీపీ నాయకులను అణగదొక్కుతున్నారని వాపోయారు. శంకర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ తనకిష్టమైన వాళ్లకు నామినేటెడ్ పదవులను కేటాయిస్తూ పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీమూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. మండల మాజీ అధ్యక్షుడు పరమశివం, సింగిల్‌విండో చైర్మన్ మోహన్, టౌన్ ప్రెసిడెంట్ షణ్ముగం, నాయకులు చంద్రయ్య, ప్రతాప్‌రెడ్డి, ఎంఎరవి, హేమభూషణంరెడ్డి, ధన, అమాసరెడ్డి, చిట్టిరెడ్డి, ధన, రవి, ఆనందయ్య, శంకరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల శతవార్షికోత్సవాలను విజయవంతం చేద్దాం


హాజరైన ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌బీఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల శత వార్షికోత్సవాలను విజయవంతం చేద్దామని ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్య పిలుపునిచ్చారు. 104వ సంవత్సరం జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. 2026లో జరిగే శత వార్షికోత్సవాలను జరుపుకునేందుకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాల విద్యార్థినే అని అన్నారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడిగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ, పురుషోత్తం, రామచంద్రయ్య, రంగయ్య, చిట్టిబాబు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతి వైకుంఠ ప్రాప్తి


రామచరణదాసు (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరమాల గ్రామంలో ఉన్న శ్రీకృష్ణాశ్రమం పీఠాధిపతి రామచరణదాసు ఆదివారం వైకుంఠప్రాప్తి చెందారు. తిరుపతి సమీపంలోని పాడిపేటకు చెందిన రుక్మాంగద(రామచరణదాసు) 1972లో కేవీబీపురం మండలం సూరమాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అనంతరం ఆయన ఉపాధ్యాయ వృత్తిని వదలి 1979లో సూరమాలలో శ్రీకృష్ణ ఆశ్రమాన్ని స్థాపించారు. అష్టాదశ పురాణలు, రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలను భక్తులకు వినిపించేవారు తన బోధనలతో భక్తిమార్గం కొనసాగించారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం వైకుంఠ ప్రాప్తి పొందినట్లు ఆయన శిష్యులు వెల్లడించారు. సోమవారం ఆశ్రమం వద్ద అంత్యక్రియలు జరగనున్నట్లు వివరించారు.

అయ్యప్పస్వామి దీక్ష పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాస్వరూపానందగిరి

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి సేవా సమితి వ్యవస్థాపకుడు, జ్యోతీరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత మురళి రచించిన అయ్యపస్వామి దీక్ష, నిత్యపూజా నియమావళి పుస్తకావిష్కరణ జరిగింది. శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి, ఉత్తరాధికారి సర్వాత్మనందగిరిస్వామి హాజరైన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... నేటి యువతకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అయ్యప్ప మాలాధారణ, నియామాలు, పూజావిధానంపై ఈ పుస్తకంలో పొందుపరచినట్లు తెలిపారు. దాసరి శ్రీనివాసులు, ఆముదాల మురళి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం నుంచి జారిపడి మహిళ మృతి


కళావతి మృతదేహం

బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీ వద్ద జరిగింది. బీఎన్‌కండ్రిగ పోలీసులు తెలిపిన వివరాలు... తడ మండలం మాంబట్టుకు చెందిన తన ద్విచక్రవాహనంలో మునెయ్య ఆదివారం శ్రీకాళహస్తికి వెళ్లి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. మున్సిపాల్ కార్యాలయం సమీపంలో బీఎన్‌కండ్రిగ మండలం వెస్టువరత్తూరుకు చెందిన కళావతి(59) ద్విచక్రవాహనంలో వస్తున్న మునెయ్యను లిఫ్ట్ అడిగింది. ఈక్రమంలో మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలో ద్విచక్రవాహనం నుంచి కళావతి జారిపడి కిందపడింది. తలకు తీవ్రగాయం కావడంతో మునెయ్య 108 అంబులెన్స్‌కు సమచారం అందించారు. ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

కార్తీక సమారాధన


వడ్డిస్తున్న సాయి తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరద్వాజ తీర్థంలో ఆదివారం జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన, వనభోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముక్కంటి ఆలయ పాలక మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ హాజరయ్యారు. ఉసిరి చెట్టు కింద జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం వన భోజనం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, జంగమ కులస్థులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం శ్రీకాళహస్తి కమిటీ నియామకం



రేణిగుంట నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో జిల్లా వడ్డెర సంఘం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర వడ్డెర సంఘ మాజీ అధ్యక్షుడు దేవళ్ల మురళి ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా చంద్రగిరి చంగల్రాయులు, ప్రధాన కార్యదర్శిగా తమ్మిశెట్టి రవీంద్ర, ఉపాధ్యక్షుడిగా చల్ల గంగరాజు నియమించారు.

కోటి సంతకాల సేకరణ



ఏర్పేడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, సర్పంచ్ శివయ్య మాట్లాడుతూ... మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మోహన్‌రెడ్డి, రాజేశ్వరి, బాలప్రసాద్‌యాదవ్, లోకనాథరెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పోలీస్ స్టేషన్ వద్ద బియ్యం సహా వాహనం

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాహనం సహా రేషన్ బియ్యాని స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డు భక్తకన్నప్ప కూడలి వద్ద వాహనంలో రేషన్‌బియ్యాన్ని లోడ్ చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ సిబ్బందితో సంఘట నా స్థలానికి చేరుకుని నలుగురు వ్యక్తులు, వ్యాను సహా 74బస్తాల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.